RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4

సంపుటి : 3, సంచిక : 190 | జూన్ 24, 2025 | వెల : రూ.3-00



కాశిక్.. నీ స్వగ్రామంలో చేసిన అభివృద్ధి ఏంటి?

4లో..





- గొర్రెలు@గాంధీభవన్..!
- యాదవ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్
- గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం వినూత్న నిరసన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- భవన్‌లో భద్రతా వైఫల్యంపై కాంగ్రెస్ వర్గాల ఆరా

# 'చేతి'లో గొర్రెలకు చోటేది?

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

అధికార హస్తం పార్టీ "చేతి"లో తమకు చోటు లేదని యాదవ కురుమ, సామాజిక వర్గాలు కినుక వహిస్తున్నాయి.! తెలంగాణ మంత్రివర్గం తో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో యాదవ, కురుమ సామాజిక వర్గాలకు చోటు కల్పించాలని కోరుతూ.. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం సోమవారం వినూత్న నిరసన చేపట్టింది. రాజకీయంగా తమకు అవకాశాలు కల్పించాలని అడిగారు. ప్రజా ప్రభుత్వంలో అందరికీ అవకాశం ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే క్రమంలో తమకు ప్రస్తుతం దక్కాల్సిన స్థానం కోసం వినూత్న మార్గంలో ఆందోళన చేపట్టారు. గొర్రెల కాపరులు లారీలో గొర్రెలు, మేకలతో గాంధీభవన్ వద్దకు చేరుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. సంక్షేమ సంఘం నాయకుడు శ్రీహరి యాదవ్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసే వరకు తమ నిరసన కొనసాగుతుందని యాదవ, కురుమ సంఘం నేతలు తెలిపారు. కాగా గాంధీభవన్‌లోకి గొర్రెలు తీసుకువచ్చిన ఘటనపై, పోలీసుల భద్రతా వైఫల్యంపై కాంగ్రెస్ వర్గాలు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పోలీసుల కట్టుదిట్ట భద్రతా ఉన్నా గొర్రెల లారీ లోపలికి రావడంపై కాంగ్రెస్ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సంఘ విద్రోహ శక్తులు వస్తే పరిస్థితి ఏంటని కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. కాగా కురుమ, యాదవ సామాజిక వర్గం నుంచి ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. రాష్ట్ర మంత్రి వర్గంలో తనకు చోటు కల్పించాలని కాంగ్రెస్ అగ్రనేతలకు వినతులను కూడా సమర్పించిన విషయం తెలిసిందే.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో యాదవ, కురుమలకు ఇప్పటి వరకూ చోటు కల్పించకపోవడం గమనార్హం. ఇది ఇలా ఉంటే గాంధీభవన్లో గొర్రెలు ఉన్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. గొర్రెలుఏ గాంధీభవన్ అంటూ నెట్టింట చర్చలు సాగుతున్నాయి



## బోనాల ఉత్సవాలకు రావాలంటూ సీఎంకి ఆహ్వానం

**వేద న్యూస్, హైదరాబాద్:**

బోనాల ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. జూలై 13 న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, అర్చకులు కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయ అర్చకులు సీఎంకి ఆశీర్వచనం అందించారు.



## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆహ్వానం

### పారంపర్య వైద్య మహా సంఘం ప్రథమ వార్షికోత్సవానికి..

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

పారంపర్య వైద్య మహా సంఘం ప్రథమ వార్షికోత్సవం జూలై 4, 5, 6 తేదీలలో యాదగిరిగుట్టలో జరుపుటకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం నాడు సంఘం తరపున హైదరాబాద్ లో వారి కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి వస్తానని మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి వనమూలిక వైద్యమును మరింత విస్తరించి ప్రజలకు మంచి వైద్యం అందించడంతోపాటు జీవన విధానంను నేర్పించాలని, భవిష్యత్తులో ప్రమాదకర అనారోగ్యాలు రాకుండా అరికట్టే బాధ్యత వనమూలికా వైద్యులకు ఉందని సూచించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పండిట్ శ్రీనివాస్ గురూజీ,యాత్రి మహర్షి, దుర్గారాణి పాల్గొన్నారు.

## అప్రమత్తత ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు

### కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

అప్రమత్తత ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం నగరంలోని బాలసముద్రంలోన్నా ఎస్సార్ డిగ్రీ కళాశాల తో పాటు వరంగల్ పరిధి బజాజ్ ఎలక్ట్రానిక్స్ లో ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకున్న అగ్నిమాపక యంత్రాల పనితీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత నష్ట నివారణ చర్యలు చేపట్టే బదులుగా ముందస్తుగా అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచుకొని పని చేసే విధంగా చేసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చునన్నారు. ఎస్సార్ కళాశాలలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక యంత్రాల ఏర్పాటు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ వారు మరికొన్ని పరికరాలు ఏర్పాటు చేసుకొని రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని ఫైర్ & సేఫ్టీ జాగ్రత్తలు పాటించాలని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో సెల్లార్‌లలో విద్యుత్ సాంకేతిక సంబంధ ఉపకరణాలు లేకుండా చూడాలని, సెల్లార్లను కేవలం వాహనాలు నిలవడానికి మాత్రమే వినియోగించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

## స్కీమ్‌ల పేరుతో.. అమాయకులకు టోకరా..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

స్కీముల పేరుతో అమాయకులను నమ్మించి విలువైన వస్తువులను ఇస్తామని నమ్మబలికి, తీరా డ్రాల టైం అయిపోయిన తర్వాత ఫోన్ ఎత్తకుండా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని అమాయకులను మోసం చేసిన ఘటన మిర్యాలగూడ నియోజకవర్గంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొమ్ము రమేష్,మండాది మల్లేశ్వరి భర్త కిరణ్ లు ఆర్కే ఎంటర్ప్రైజెస్ పేరుతో సి20 స్కీం పెట్టారు. నెలకు వెయ్యి రూపాయల చొప్పున 15 నెలలు కడితే ప్రతి నెల డ్రా తీసి పది మందికి విలువైన వస్తువులు ఇస్తామని 15 నెలల తర్వాత కూడా డ్రాలో పేర్లు రాకుంటే వారందరికీ కూ డా విలువైన వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. ఆ మాట లను నమ్మి సుమారు 250 మంది అమాయకులు చైన్ సిస్టం లా ఒకరి ద్వారా మరొకరు ఈ స్కీమ్‌లో చేరడం జరిగింది.స్కీం లెక్క ప్రకారం 15 నెలలు దాటిన తర్వాత ఎంతో మంది అమాయకులు డ్రాలో తమ పేరు రాకపోవడం వల్ల తమకు కూడా విలువైన గిఫ్టులు ఇస్తారని ఎదురు చూశారు.చివరికి సదరు నిందితులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఉండడం లేదా ఫోన్లు ఎత్తకపోవడం లాంటివి చేస్తుండడంతో,బాధితులు మోసపోయామని గ్రహించి సదరు నిందితుల ఇంటికి వెళితే తాళం వేసి ఉంటుంది.బాధితులు తామంత మోసపోయామని గ్రహించి తమకు న్యాయం జరగాలని బాధితులైన పిటిషన్ దారులు వెంకటమ్మ కలాల్ వాడ మిర్యాలగూడ తో పాటు బంటు అనూష,గాదబోయిన నిర్మల,బంటు అరుణ,దైద కుసుమ,దోనేటి సత్యవతి,దోసపాటి విజయ లు మరికొంతమంది బాధితులతో కలిసి తమకు న్యాయం జరగాలని పట్టణ పరిధిలోని వన్టౌన్ స్టేషన్ నందు పిటీషన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వన్టౌన్ సీఐ సిహెచ్ మోతిరామ్ మాట్లాడుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని,స్కీం ఫ్రాడ్ కు సంబంధించిన నిందితులను పట్టుకొని న్యాయస్థానానికి అప్పచెబుతామని అన్నారు. ప్రజలందరూ ఇలాంటి మోసపూరిత స్కీం లలో వెనక ముందు ఆలోచించకుండా తమ డబ్బును పెట్టుబడి పెట్టి,కష్టార్జితాన్ని వృధా చేసుకోవద్దని,లక్కీ స్కీములు,బంపర్ డ్రాలకు అలవాటు పడద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసపూరితమైన స్కీములను పెట్టినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.






## బల్దియా కమిషనర్‌ను కలసిన డిఎఫ్ఓ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

బల్దియా కమిషనర్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్‌ను సోమవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండల పరిధిలో అక్రమంగా పిడిఎఫ్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకొని కేసు నమోదు చేసినట్లుగా రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ మండల పరిధిలోని నందిపాడు గ్రామ శివారులో కేశవ దాబా హెూటల్ వద్ద ఒక ఆటోలో పిడిఎస్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు సిబ్బందితో పాటు వెళ్లి తనిఖీ నిర్వహించగా ఏపీ 24 X 6052 నెంబర్ గల ఆటోలో మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలానా అతని భార్య షేక్ షాహినాలు ఉప్పు,ముగ్గు అమ్ముతూ అదే సమయంలో తెల్ల రేషన్ కార్డు దారుల వద్ద

మిగతా 4వ పేజీలో..



వేద న్యూస్

మంగళవారం, జూన్ 24, 2025

# ఇరాన్ ఫోర్డో అణు కేంద్రానికి తీవ్ర నష్టం

- ఇరాన్ ఫోర్డో అణు కేంద్రంపై అమెరికా వైమానిక దాడులు
- కేంద్రానికి తీవ్ర నష్టం వాటిల్లి ఉంటుందని ఐఏఈఏ అంచనా
- వియన్నాలో ఐఏఈఏ అధిపతి రఫెల్ గ్రోస్సీ సోమవారం ప్రకటన

**వేద న్యూస్, డెస్క్:**



ఇరాన్‌లోని ఫోర్డో భూగర్భ అణు కేంద్రంపై అమెరికా జరిపిన వైమానిక దాడిలో తీవ్రమైన నష్టం వాటిల్లి ఉంటుందని ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షక సంస్థ అధిపతి రఫెల్ మరియానో గ్రోస్సీ వెల్లడించారు. అత్యాధునిక బంకర్-బస్టర్ బాంబులను ఈ దాడిలో ఉపయోగించినట్లు ఆయన తెలిపారు. వియన్నాలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) అధిపతి గ్రోస్సీ మాట్లాడుతూ, "దాడిలో ఉపయోగించిన పేలుడు పదార్థాల మోతాదు, అలాగే సెంట్రిఫ్యూజ్‌లు అత్యంత సున్నితంగా కంపనాలకు ప్రతిస్పందించే స్వభావం కలిగి ఉండటం వల్ల చాలా గణనీయమైన నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నాం" అని వివరించారు. ఫోర్డో అణు కేంద్రం ఇరాన్ కీలకమైన యురేనియం శుద్ధి కేంద్రాలలో ఒకటిగా పేరు పొందింది. అయితే, ఫోర్డోలోని భూగర్భంలో జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేయగల స్థితిలో ప్రస్తుతం ఐఏఈఏతో సహా మరెవరూ లేరని మిస్టర్ గ్రోస్సీ స్పష్టం చేశారు. "ఈ సమయంలో, ఫోర్డోలోని భూగర్భ నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడానికి ఐఏఈఏతో సహా ఎవరి వద్దా కచ్చితమైన సమాచారం లేదు" అని ఆయన అన్నారు. దాడి జరిగిన ప్రదేశానికి తక్షణమే ప్రవేశం లభించే అవకాశాలు తక్కువగా ఉండటంతో, నష్టంపై పూర్తి స్పష్టత రావడానికి కొంత సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

# ఇంద్రకీలాద్రి ఆలయాభివృద్ధిలో కీలక మార్పులు

**వేద న్యూస్, డెస్క్:**

ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల్లో కొన్ని మార్పులు చేపట్టబో తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడిం చారు. అందుకు సంబంధించిన అభివృద్ధి పనులు మరింత త్వరగా చేసేందుకు నగర మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలంతా కలిసి సమిష్టి నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సైతం ఇచ్చారన్నారు. అమ్మవారి ఆలయనికి వచ్చే భక్తుల పార్కింగ్ ఏర్పాట్లపై 2047 నాటికి మాస్టర్ ప్లాన్ ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. భక్తులకు హోల్డింగ్ ఏరియా ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసిజర్‌లో భాగంగా అన్న వితరణలో పూర్తి క్వాలిటీ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే ప్రసాదాలు పూర్తి స్థాయి క్వాలిటీతో ఉండాలని నిర్ణయించామన్నారు. అదే విధంగా ఇంద్రకీలాద్రిపై చెట్లను పెంచే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు సేద తీరేందుకు ప్రత్యేకంగా బల్లలు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేశ ఖండనశాలలను ఏర్పాటును సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28వ తేదీన మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు చెప్పా రు. ఈ సమావేశానికి పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఎండోమెంట్ కమిషనర్ హాజరవుతారన్నారు. ఇంజనీరింగ్ విభాగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని.. వాటిపై అందరితో కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.


అయితే ఆలయానికి చెందిన కొన్ని స్థలాలు వివాదాల్లో ఉన్నాయని వివరించారు. వాటిలో కొన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించినవి కాగా.. మరికొన్ని ఇరిగేషన్ శాఖకు సంబంధించినవని సోదాహరణగా తెలిపారు. వీటిపై జూన్ 28వ తేదీన జరగనున్న సమావేశంలో సమగ్రంగా చర్చిం చి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. మాస్టర్ ప్లాన్ రాగానే అభివృద్ధి పనులు మరింత త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పా రు. దసరా నవరాత్రులు అనంతరం కృష్ణ పుష్కరాలు నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు.

# ఇరు దేశాల మధ్య మరింత పెరిగిన ఉద్రిక్తతలు

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల మోత
- 6 ఎయిర్‌పోర్టులపై దాడులు, 15 విమానాలు ధ్వంసం
- గగనతలంలో ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్ తీవ్ర దాడులు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఇరాన్ గగనతలంలో తమ ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకునే దిశగా కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇరాన్‌లోని ఆరు విమానాశ్రయాలపై దాడులు చేసి, 15 సైనిక విమానాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను మరింత ఆందోళనకరంగా మార్చింది. ఐడీఎఫ్ 'ఎక్స్' వేదికగా ఈ దాడి వివరాలను వెల్లడించింది. "ఇరాన్ గగనతలంలో వైమానిక ఆధిపత్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా, పశ్చిమ, తూర్పు, మధ్య ఇరాన్‌లోని ఆరు ఇరాన్ ప్రభుత్వ విమానాశ్రయాలపై ఐడీఎఫ్ దాడి చేసింది. ఈ దాడుల్లో రన్‌వేలు, భూగర్భ బంకర్లు, ఒక రీఫ్యూయెలింగ్ విమానం, మరియు ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ఎఫ్-14, ఎఫ్-5, మరియు ఏహెచ్-1 విమానాలు ధ్వంసమ య్యాయి" అని ఐడీఎఫ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో రిమోట్‌గా నడిచే మానవరహిత విమానా లను (డ్రోన్లు) ఉపయోగించినట్లు పేర్కొంది. ఇరాన్ భూభాగంలో ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవడానికి ఉద్దేశించిన విమానాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ స్పష్టం చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ నేటితో 11వ రోజుకు చేరుకుంది. జూన్ 13న ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్ అణు మౌలిక సదుపా యాలు, సైనిక స్థావరాలు, సీనియర్ కమాండర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు ప్రారంభించడంతో ఈ ఉద్రిక్త తలు మొదలయ్యాయి. దీనికి ప్రతిగా, ఇరాన్ 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇజ్రాయెల్ లక్ష్యాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల వల్ల సదరు విమానాశ్రయాల నుంచి విమానాలు టేకాఫ్ అయ్యే



సామర్థ్యం దెబ్బతిన్నదని, ఇరాన్ సైన్యానికి చెందిన వైమానిక శక్తి కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని కూడా వారు జోడించారు. మరోవైపు, ఇజ్రాయెల్ ప్రధానమ ంత్రి బెంజమిన్ నెతన్యాహు నిన్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో తమ లక్ష్యాలను సాధించడానికి ఇజ్రాయెల్ చాలా దగ్గరగా ఉందని, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి, అణు కేంద్రాలకు ఇప్పటికే గణనీయమైన నష్టం కలిగించామని ఆయన పేర్కొన్నారు. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం పోరాటంలో ఇజ్రాయెల్‌ను లాగడానికి తాను ఇష్టపడనని నెతన్యాహు స్పష్టం చేశారు. "లక్ష్యాలను సాధించడానికి అవసరమైన దానికంటే ఎక్కువగా మా చర్యలను కొనసాగించబోము, అలాగని ఇప్పటికిప్పుడే ముగించం" అని ఆయన అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ, "లక్ష్యాలు సాధించినప్పుడు, ఆపరేషన్ పూర్తవుతుంది మరియు పోరాటం ఆగిపోతుంది" అని నెతన్యాహు వివరించారు.






## ఇక క్యూలైన్లలో వేచి ఉండాల్సిన

# అవసరం లేదు

**వేద న్యూస్, డెస్క్:**

తిరుమల వెళ్లే భక్తులకు ఇది పెద్ద శుభవార్త అని చెప్పాలి. ఎందుకంటే..ఇకపై శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం క్యూలలో వేచి ఉండాల్సిన అవసరం లేదు..! తిరుమల లడ్డూ కౌంటర్లలో రద్దీని, సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. డిజిటల్ విధానంలో టిక్కెట్లు కొనుగోలు చేయగల కొత్త కియోస్క్‌లను టిటిడి ఏర్పాటు చేసింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానాన్ని ఆదివారం ప్రారంభించింది టిటిడి. ఇందుకోసం భక్తులు తమ దర్శన టికెట్ నంబర్‌ను నమోదు చేసి, మీకు కావాల్సిన లడ్డూల సంఖ్యను ఎంపిక చేసుకుని యూపీఐ ద్వారా నగదు చెల్లించాలి. ఆ రసీదును లడ్డూ కౌంటర్‌లో ఇస్తే లడ్డూలను అందిస్తారు. ఈ విధానాన్ని కొద్ది రోజులు పరిశీలించనున్నారు. ఏవైనా లోటు పాట్లు ఉంటే దాన్ని బట్టి సవరణలు చేస్తారు. భక్తులు కావాలంటే 10 నుంచి 15 లడ్డూల వరకు పొందవచ్చు. అయితే, లడ్డూల నిల్వను బట్టి ఈ సంఖ్య మారుతుందని గమనించగలరు.. దర్శన టికెట్ లేని వారు ఆధార్ నంబర్ ఉపయోగించి రెండు లడ్డూలు పొందవచ్చు. యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కియోస్క్‌లు లడ్డూ కౌంటర్ సమీపంలో ఉన్నాయి. విచారణ కేంద్రం, కేంద్రం, శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌లో కూడా కియోస్క్‌లు అందుబాటులో ఉంటాయి. ఇదిలా ఉంటే, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి అన్ని కంపార్ట్ మెంట్లు నిండి బయట కృష్ణతేజ గెస్ట్ హౌస్ వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,254 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 33,777 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ. 4.28 కోట్లు వచ్చింది. టైమ్ స్లాట్ దర్శనానికి సుమారు 6 గంటలు, టికెట్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది

# నా పర్యటనకు ఆంక్షలెందుకు?

- సింగయ్య మృతి వ్యవహారంపై స్పందించిన జగన్ - చంద్రబాబు రాజకీయాలను దిగజార్చారంటూ జగన్ ఫైర్

**వేద న్యూస్, డెస్క్:**

పల్నాడు జిల్లా జగన్ పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి మృతి తీవ్ర వివాదాస్పదం అయిన నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు తన తీరుతో రాజకీయాలను మరింత దిగజార్చారని ఆరోపిస్తూ, పలు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన పర్యటనలపై ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారని, కార్యకర్తలు తనను కలవకుండా ఎందుకు కట్టడి చేస్తున్నారని జగన్ ప్రశ్నించారు. "గతంలో మీరు గానీ, మీ మిత్రుడు పవన్ కల్యాణ్ గానీ పర్యటనలు చేసినప్పుడు మేమెప్పుడైనా ఇలాంటి ఆంక్షలు విధించామా?" అని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడిగా పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లడం, రైతులు, ప్రజలకు సంఘీభావం తెలపడం తప్పా అని ప్రశ్నించారు. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత అనేది మాజీ ముఖ్యమంత్రులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని తమకు నచ్చినప్పుడు ఉపసంహరించుకునే అధికారం ఏ ప్రభుత్వానికీ ఉండదని జగన్ స్పష్టం చేశారు. "మీకు మూడ్ వచ్చినప్పుడు భద్రత ఇస్తాం, లేనప్పుడు ఉపసంహరించుకుంటాం అనడానికి ఇది మీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండదు. ఇది నాకైనా, మీకైనా వర్తించే ప్రోటోకాల్" అని స్పష్టం చేశారు. జడ్ ప్లస్ భద్రత కలిగిన మాజీ ముఖ్యమంత్రి పర్యటన గురించి ముందుగానే సమాచారం ఇచ్చిన తర్వాత, అందుకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుందని గుర్తుచే శారు. తన పర్యటన సందర్భంగా రూట్ మ్యాప్ ఇచ్చినప్పటికీ, పైలట్ వాహనాలు, రోప్ పార్టీలు వంటి భద్రతా ఏర్పాట్లు ఎందుకు కొరవడ్డాయని జగన్ ప్రశ్నించారు.



"జనం ఎక్కువగా ఉన్నప్పుడు, జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి వాహనం చుట్టూ రోప్ పార్టీ ఉండాల్సిన అవసరం లేదా? ఒకవేళ భద్రత కల్పించి ఉంటే, వాహనం కింద మనుషులు ఎలా పడగలుగుతారు? మీరు భద్రత కల్పించలేదన్నది నిజమా, లేక వాహనం కింద ఎవరూ పడలేదన్నది నిజమా?" అని ఆయన నిలదీశారు. జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రికి బుల్లెట్ ప్రూఫ్ వాహనం, ప్రభుత్వ డ్రైవర్‌ను కేటాయించడం కూడా ప్రోటోకాల్‌లో భాగమేనని జగన్ తెలిపారు. "మీరు సరైన బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వకపోతే, ప్రభుత్వ అనుమతితో నా సొంత డబ్బుతో వాహనం కొనుక్కున్నాను. డ్రైవర్‌ను మీరే ఇచ్చారు. మరి మీ ప్రభుత్వ డ్రైవర్ నడుపుతున్న వాహనానికి, మీరు ఏర్పాటు చేయాల్సిన పైలట్, రోప్ పార్టీల భద్రతా ఏర్పాట్లకు మీదే కదా బాధ్యత?" అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఆరోజు ఎస్పీ ఇచ్చిన స్టేట్‌మెంట్ సంగతి ఏమిటని కూడా జగన్ ప్రస్తావించారు.

# కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది

**వేద న్యూస్, డెస్క్:**

సత్తెనపల్లిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలో మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఏ2గా చేర్చడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. జగన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోని వాహనం చక్రాల కింద పడి సింగయ్య మృతి చెందినట్లు కొన్ని వీడియోల ఆధారంగా పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు వాహన డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేయగా, అందులో జగన్‌ను రెండో నిందితుడిగా పేర్కొన్నారు. ఈ పరిణామంపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక, ఆయన్ను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపాలని కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు.

# సంపాదకీయం

### ఆకలి కేకలు ఒకవైపు అన్నపురాసులు మరొక వైపు

మానవ మనుగడకు ఆహారం ఆకలి ప్రధానమైనటువంటి అంశాలు కాగా వీటి అసమతుల్యత, దుర్వినియోగం ,సమయస్పూర్తి లేకపోవడం, ఆహారం పట్ల నిర్లక్ష్యం, పండించిన రైతుల పట్ల చులకన భావం, నాగరికత ముసుగులో కొనసాగుతున్నటువంటి ఆదిపత్య ధోరణి, అహంభావం వల్ల జరుగుతున్న ఆహార వృధాను గండి కొట్టాల్సిన అవసరం చాలా ఉన్నది. ఇది కేవలం ఒక దేశానికి సంబంధించిన విషయం కాదు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నటువంటి త ప్పుడు ఆలోచన ఆచరణ దాని పర్యవసానం అనేక పరిణామాలు.ఆకలి కేకలతో అల్లాడుతున్నటువంటి కోట్లాదిమంది ప్రపంచంలో ఈనాటికీ మనకు తారసపడుతున్నారు అయినా వృధా చేసే దగ్గర అంతులేని వృధా అవుతూ ఉంటే ఆలోచించే కొద్ది మందికి మాత్రమే బాధ అనిపించడం మొత్తం మీద ఆహార సరఫరా లో అసమతుల్యత ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యగా భావిస్తే కానీ దానికి పరిష్కారం దొరకదు. ప్రముఖ విప్లవకవి కాలోజీ అన్నట్లుగా అన్నపురాశులు ఒకచోట ఆకలి మంటలు మరకచోట అనేది నిత్యకృతం. సర్వత్రా కనిపిస్తున్నటువంటి సజీవ సాక్ష్యం. అయితే ఆహార ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్నటువంటి శ్రమజీవులు కార్మికులు, రైతులు కూలీలను ఎవరూ కూడా గౌరవించకపోవడం చూడకపోవడం గుర్తించబడకపోవడం వారి శ్రమను దోపిడీ చేయడమే అవుతుంది. ఆహార వృధా అనేది నిజంగా రైతు లోకాన్ని వ్యవసాయ రంగాన్ని అవమానించడం తప్ప మరొకటి కాదు అని ప్రతి మనిషి గుర్తించాలి .ప్రతి రంగానికి సంబంధించి జాతీయస్థాయిలోనూ అంతర్జాతీయ స్థాయిలోనూ సూచికలు ఉన్నట్లుగా ఆహార వృధాకు సంబంధించి కూడా ప్రపంచ స్థాయిలో ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ రిపోర్టు 2024 వ్యక్తం చేసినటువంటి అభిప్రాయాలు తెలుసుకుంటే మనం వేస్తున్న తప్పటడుగులు, చేస్తున్న దురాలోచన, వృధా అంతా ఇంతా కాదు. అందుకే ఒకవైపు పస్తులు మరొకవైపు వృధా అనే నినాదం కూడా బలీ యమైనది దానిని లోతుగా ఆలోచించవలసిన అవసరం కూడా ఉన్నది. ఇప్పటికీ ప్రపంచంలోని అనేక దేశాలలో ఒకవైపు అనారోగ్యం కారణంగా వాయు ఇతర కాలుష్యాలతో పాటు ఓజోన్ పొర రంధ్రం పడి అతినీలలోహిత కిరణాల కారణంగా చావు బతుకుల్లో పిల్లలు పెద్దలు కొట్టుమిట్టాడుతూ ఉంటే మరికొన్ని దేశాలలో కనీసమైన ఆహారమే కరువై బక్క చిక్కిన బాలలు భవిష్యత్తుకు వారసులు ఎలా అవుతారు అర్థం చేసుకోవచ్చు. దేశాలకు ప్రాంతాలకు అతీతంగా చూడవలసినటువంటి ఈ సమస్యను ఎక్కడికక్కడ పరిష్కరించుకోవడం మొత్తం మీద వృధా ను తగ్గించుకోవడం మిగులు దేశాల నుండి లోటు దేశాలకు సరఫరా చేయడం వల్ల ఆ బాధ్యతను అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి మానవ హక్కులను పరిరక్షించే క్రమంలో బాధ్యతగా చేపట్టడం వలన ఆహార పంపిణీ సాధ్యమవుతుంది. ఒకచోట పస్తులు మరొకచోట వృధా అనేదానికి అడ్డుకట్ట వేయడానికి ఆస్కారం ఉంటుంది దీనికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి రిపోర్ట్ ఆధారంగా అన్ని దేశాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రపంచమంతా కుటుంబం లాగా భావించినప్పుడు మాత్రమే ఈ ఆహార వృధాను అరికట్టడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికీ వివాహాలు ఇతర శుభ కార్యక్రమాలు ఫంక్షన్లు సభలు సమావేశాల సందర్భంగా భోజన సౌకర్యం ఏర్పాటు చేసిన ప్రతిచోట అంతేకాదు హోటల్లు రెస్టారెంట్లు బార్లతో పాటు కుటుంబంలో ప్రతి నిత్యం కూడా కోట్ల టన్నుల ఆహారం వృధా అవుతున్నట్లుగా మనం గమనించవచ్చు. ఒక్కసారి మన కుటుంబాలను మనం పరిశీలిస్తే ఎంత వృధా చేస్తున్నామో అర్థం చేసుకోవచ్చు కదా! ఇదంతా జాతి సంపదను కొల్లగొట్టడమే అవుతుంది రైతులను అవమానించడమే అవుతుంది ఆ హక్కు మనకు లేదు అని తెలుసుకోవడం చాలా అవసరం.

ఒకరికి తినడానికి దొరకదు మరొకరికి తింటే అరగదు ఇష్టం లేక కొందరు,నాగరికత పేరుతో మరికొందరు, అహంభావంతోనే కొందరు, అంచనా సరిగా లేక మరికొన్నిచోట్ల కారణం ఏదైతేనేమి ఆహారం వృధా కావడం అనేది ప్రవహిస్తున్న నీళ్లలా సర్వత్రా వ్యాపించి మానవ నాగరికతను ప్రశ్నిస్తున్నది దానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రపంచ మానవులందరి మీద ఉన్నది. ఒక్కసారి నివేదిక అంశాలను పరిశీలిద్దాం .2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 73 కోట్ల మంది ఆకలి బాధను అనుభవించినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది అంటే ఆకలి తీవ్రత ప్రపంచవ్యాప్తంగా ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు ఈ రకంగా ఎంతోమంది తిండిలేక అలమటిస్తుంటే మరొకవైపు పెద్ద మొత్తంలో ఆహారం చెత్తకుప్ప ల్లోకి చేరడం, దుబారా కావడం, డ్రైనేజీల పాలు కావడాన్ని మనం గమనించవచ్చు. ఈ దుబారా అనేది కేవలం వినోదాల వంటి పెద్ద కార్యక్రమాల్లోనే కాకుండా ఇండ్లు హోటల్లు చిల్లర దుకాణాలు వంటి చోట్ల కూడా ఆహారం మట్టి పాలు కావడం, ఆకలైన వానికి దొరకకపోవడం, ఉన్న దగ్గర తినకపోవడం ఈ అసమతుల్యతను ఎట్లా అర్థం చేసుకుందాం? సాధారణంగా వినియోగదారులు ఆహారాన్ని తీసుకునే క్రమంలో కూడా అందుబాటులోకి వచ్చినటువంటి ఆహారంలో సుమారు 19 శాతం నిరుపయోగం అవుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022లో ప్రపంచవ్యాప్తంగా చేసిన గణన ఆధారంగా కుటుంబాల్లో ఇండ్లలో 63 కోట్ల టన్నుల ఆహార పదార్థాలు చెత్తలో కలిసిపోయినట్లు దుబారా అయినట్లు గణాంకాలు వెల్లడిస్తుంటే ఈ రకంగా దుబారా అయ్యేటటువంటి ఆహార పదార్థాలను ఇష్టం ఉన్నట్లుగా అంచనా వేసి మట్టిలో కలుప కుండా ఉండి ఉంటే ఆకలితో అలమటించే అన్నార్తుల ఆకలి బాధలు తీ ర్చడానికి రోజుకు ఒక పూట అయినా అందించే అవకాశం ఉండేది కదా? ఈ దుబారాను అరికట్టడానికి ఏ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి? ఎవరు ఆలోచించాలి? దీనికి న్యాయ నిర్ణేత ఎవరు? అని ఆలోచిస్తే ఇది ఎక్కడికక్కడ జరగాల్సినటువంటి ప్రక్రియ. మొత్తం మీద ఆహారం మీద, పండించిన ఆహార పదార్థాల మీద, దానికి మూలకారకులైనటువంటి రైతుల మీద గౌరవభావం ఉన్నప్పుడు మాత్రమే ఈ రకంగా వృధా చేయకుండా చాలా జాగ్రత్తగా వుండే అవకాశం ఉంటుంది.

# ఇరాన్‌పై అమెరికా దాడి తర్వాత ప్రతిపక్షాల తీవ్ర వ్యతిరేకత

- ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్
- ట్రంప్ చర్యలు శాంతికి విరుద్ధమంటున్న విపక్ష నేతలు
- షరీఫ్ ప్రభుత్వంపై అన్ని వైపుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి

**వేద న్యూస్, డెస్క్:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన ప్రస్తుతం ఆ దేశంలో వివాదాస్పదంగా మారింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో, ట్రంప్‌కు నోబెల్ పురస్కారం ఇవ్వాలన్న నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని పాకిస్థాన్‌లోని ప్రతిపక్షాలు షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్యతో పాకిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయంగా నవ్వులపాలైందని ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి పాకిస్థాన్ నామినేట్ చేసిన మరుసటి రోజే ఆయన ఇరాన్‌పై దాడులకు ఆదేశించడం చర్చనీయాంశమైంది. పలు దేశాలు ట్రంప్ చర్యలను తీవ్రంగా ఖండించాయి. ఈ పరిణామం పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ప్రతిపక్షమైన పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందిన శాసనసభ్యుడు అలీ ముహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్-ఇరాన్ వివాదంలో తమ దేశం ఇరాన్‌కే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడులకు పాల్పడిన వ్యక్తికి నోబెల్ బహుమతి ప్రతిపాదించడం ద్వారా ట్రంప్, పాకిస్థాన్ ప్రభుత్వాన్ని సిగ్గుపడేలా చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షరీఫ్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌లోని ప్రముఖ రాజకీయ నాయకుడు, జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) పార్టీ అధినేత



మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ కూడా ఈ విషయంపై తీవ్రంగా స్పందించారు. పాక్ మాజీ సెనేటర్ ముషాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ, ట్రంప్ శాంతి కోసం పాటుపడే నాయకుడు కాదని, ఉద్దేశపూర్వకంగానే ఆయన పలు యుద్ధాలకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. అన్ని దేశాలను నాశనం చేయాలనే ఆలోచనతో ట్రంప్, అమెరికా పతనానికి అధ్యక్షత వహిస్తున్నారని దుయ్యబట్టారు. రక్తంతో తడిసిన ఆయన చేతులకు శాంతి బహుమతిని అందుకునే అర్హత లేదని ముషాహిద్ హుస్సేన్ ఘాటుగా వ్యాఖ్యానించారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతికాముకుడు కాదని, ఆయన చర్యలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. పాలస్తీనా, సిరియా, లెబనాన్, ఇరాన్‌లపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు మద్దతు ఇస్తున్న ట్రంప్ ఎలా శాంతిదూత అవుతారని ఆయన ప్రశ్నించారు. పాక్ ఆర్మీ చీఫ్ (సీఓఏఎస్) అసిమ్ మునీర్‌తో ట్రంప్ సమావేశం కావడం, ఆయనకు విందు ఇవ్వడం వల్లే పాక్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసి ఉండవచ్చని రెహ్మాన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కూడా డిమాండ్ చేశారు.

## క్రూడాయిల్ ను ఇరాన్
# ఆపేస్తే భారత్‌కి ఇబ్బంది లేదు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




ఇరాన్ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ కావడం- గేమ్‌ఛేంజర్ అవుతుందా? దాడులు చేసిన తర్వాత, ట్రంప్ శాంతిమంత్రం జపించినా, అంతా కూల్ అవుతుందా? ప్రపంచం మీద ఇరాన్ కొత్తగా దాడులు చేయాల్సిన అవసరం లేదు. క్రూడాయిల్ సరఫరా ఆపేస్తామంటే చాలు, మనం హడలిపోతాం.. ఎందుకంటే, క్రూడాయిల్ సరఫరాను ఇరాన్ ఆపేస్తే, అంతర్జాతీయంగా సమస్య వస్తుంది. ఒకవైపు హార్ముజ్ జలసంధి మార్గం మూసివేత.. మరోవైపు క్రూడాయిల్ నిలిపివేతతో.. ధరలు అమాంతం పెరిగితే, మనదేశంలోనూ ధరలు పెరుగుతాయనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక ప్రకటన చేశారు. మొత్తంగా.. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు గండం ఏర్పడింది. అమెరికా దాడులతో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి.. 78 డాలర్లకు పైగా బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ట్రేడవుతోంది.. అయితే.. చమురు ధరలు పెరిగితే సామాన్యుడిపై భారం తప్పదని పేర్కొంటున్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులతో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దేశంలోని చమురు కంపెనీల దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయని, వివిధ మార్గాల ద్వారా ఇంధన సరఫరాలు నిరంతరాయంగా అందుతున్నాయన్నారు కేంద్రమంత్రి. హార్ముజ్ మార్గం బంద్దైనా భారత్‌కి ఇబ్బంది లేదు.. వేరే మార్గాల్లో భారత్‌కు క్రూడాయిల్ వస్తుంది.. 2 మిలియన్ బారెళ్లలోపే హార్ముజ్ గుండా దిగుమతి చేసుకుంటాం.. భారత్‌కు వేరే మార్గాలనుంచి 4 మిలియన్ బారెళ్ల క్రూడాయిల్ వస్తుంది. మన కంపెనీల దగ్గర మూడువారాల నిల్వలు ఉన్నాయి.. ఇతర మార్గాల్లో క్రూడాయిల్ దిగుమతిపై దృష్టి పెడతాం అంటూ కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## యుద్ధంలో కనిపించకుండా
# పోయిన భారతీయుడు


- ఇరాన్‌లో బీహార్‌కు చెందిన ఇంజనీర్ సిరాజ్ అదృశ్యం
- జూన్ 17 నుంచి సిరాజ్‌తో ఎలాంటి కాంటాక్ట్ లేదన్న తండ్రి
- కొడుకును సురక్షితంగా తీసుకురావాలని తండ్రి ఆవేదన

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, బీహార్‌కు చెందిన యువ ఇంజనీర్ ఒకరు ఇరాన్‌లో అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. సివాన్ జిల్లా, ముఫఫసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రమాపాలి గ్రామానికి చెందిన సిరాజ్ అలీ అన్సారీ (25) ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సిరాజ్ ఒక పెట్రోలియం కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, ప్రస్తుతం ఇరాన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సిరాజ్ తండ్రి హజరత్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, సిరాజ్ సౌదీ అరేబియా మీదుగా జూన్ 9న ఇరాన్ చేరుకున్నారు. అయితే, అతడు అక్కడికి వెళ్లిన కొన్ని రోజులకే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమై ఘర్షణ వాతావరణం నెలకొంది. సిరాజ్‌తో చివరిసారిగా జూన్ 17న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మాట్లాడినట్లు హజరత్ అలీ చెప్పారు. అప్పటి నుంచి సిరాజ్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని, ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'చివరిసారి మాట్లాడినప్పుడు, తాను సురక్షితంగానే ఉన్నానని, కానీ తాను ఉంటున్న ప్రదేశానికి కేవలం కిలోమీటరు దూరంలో బాంబు దాడులు జరుగుతున్నాయని సిరాజ్ చెప్పాడు" అని హజరత్ అలీ గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నుంచి వాడి దగ్గర నుంచి ఎలాంటి కబురు లేదు. మాకు చాలా ఆందోళనగా ఉంది" అని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. సిరాజ్ అదృశ్యంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, సివాన్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదిత్య ప్రకాశ్ కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సిరాజ్‌ను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరారు.

## రైల్వేలో భారీగా ఉద్యోగాలకు నోటిఫికేషన్



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

రైల్వేలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఇండియన్ రైల్వే గుడ్‌న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో భారీగా కొలువుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు.. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తుంది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 6,180 టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల్లో టెక్నీషియన్ గ్రేడ్ సిగ్నల్ పోస్టులు 180, టెక్నీషియన్ గ్రేడ్-పోస్టులు 6,000 వరకు ఉన్నాయి. అందిన సమాచారం మేరకు జూన్ 28వ తేదీన నోటిఫికేషన్ విడుదలకానుంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 28వ తేదీ నుంచే ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోండి.. సికింద్రాబాద్ సహా.. అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.. ఆర్ఆర్‌బీ రీజియన్లలో టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జులై 28, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో జారీ అయిన షార్ట్ నోటిఫికేషన్ ప్రకారం.. 2025, జులై 1 నాటికి గ్రేడ్ 1 అభ్యర్థులకు వయోపరిమితి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రేడ్ 3 అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అయితే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఉండవల్సిన అర్హతలు, వయోపరిమితితోపాటు ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు ఫీజు వంటి తదితర వివరాలు త్వరలోనే విడుదలయ్యే వివరణాత్మక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు. అలాగే రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు అందులోనే ఉంటాయి.



వేద న్యూస్

మంగళవారం జూన్ 24, 2025




## విద్యతోనే అభివృద్ధి

**వేద న్యూస్, భద్రాచలం:**

విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితంలో అభివృద్ధి సాధ్యమని సుకోత్ సేవా సంఘం అధ్యక్షుడు వేణు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో చదువు పట్ల పిల్లలకి అవగాహన పెంచి వారికి స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వేణు కుమార్, శ్రావణ్ కుమార్, గీతాంజలి పాల్గొన్నారు.

## ఈ నామ్ పద్ధతిని రద్దు చేయాలి

**వేద న్యూస్, కాశీబుగ్గ :**



వరంగల్ వ్యవసాయ మార్కెట్లో అమలవుతున్న ఈ నామ్ పద్ధతిని రద్దు చేయాలని కోరుతూ సోమవారం మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌ని రైతు సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్లో ని పసుపు యార్డులో గత కొంతకాలంగా అమలవుతున్న ఈ నామ్ విధానం ద్వారా రైతులు నష్టపోతున్నారని కావున దీనిని రద్దు చేయాలని జేడీఎంనీ వారు కోరారు. జేడీఎంను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, అఖిల భారత కిసాన్ సంఘటన్ సుధ మల్ల భాస్కర్, అఖిలభారతం కిసాన్ సంయుక్త సభ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్ లు ఉన్నారు.



## పల్లెలలో ఇందిరమ్మ ఇంటి సంబరాలు

**వేద న్యూస్, నర్సంపేట :**

పేదోడి కళని నేడు ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందని పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల పండుగ సంబరాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మండలఅధ్యక్షులు బక్కి అశోక్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదోడి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ మండలంలోని పత్తిపాక గ్రామంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ లబ్ధిదారులులకు సోమవారం ఇందిరమ్మ గృహ నిర్మాణ ముగ్గు పోసి భూమి పూజలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేద వాడికి అందించాలనే సంకల్పంతో ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడ్యా తిరుమల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుసుమ చెన్న కేశవులు, నర్సంపేట కోర్టు ఏజిపి బండి శివ, ఇదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్ బొమ్మెరా బోయిన రమేష్ యాదవ్, మహిళ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామరపు శిరీష –రాము, దొమ్మటి నారాయణ, చంద్రమౌళి, పత్తిపాక గ్రామ పార్టీ అధ్యక్షులు ఉషిల్లపాటిరాజు, సురేష్, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి

**వేద న్యూస్, నర్సంపేట :**

నర్సంపేట పట్టణంలో ఓంకార్ భవన్ లో సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాలు ఏ.ఐ.ఎఫ్.డీ.ఎస్, ఏ.ఐ.ఎస్.బి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ లు మాట్లాడుతూ నర్సంపేట పట్టణ కేంద్రంలోని 25 ప్రైవేటు పాఠశాలలకు పర్మిషన్ ఉంటే, అనధికారికంగా 14 ప్రైవేట్ పాఠశాలలు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. పట్టణంలో అనధికారికంగా నడపబడుతున్నటువంటి ప్రైవేట్ పాఠశాలలపై స్థానిక ఎం.ఈ.ఓ లు విచారణ జరిపించి తక్షణమే వాటిని మూసివేసి, శాఖను తప్పుదోవ పట్టిస్తున్న ఆ స్కూల్ యాజమాన్యాలపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ రోహిత్, ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, పోలబోయిన రాజు, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత

మొదటి పేజీ తరువాయి

తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం ను సుమారు 5 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశారని, వాటిని ఎక్కువ ధరకు అమ్మడం కోసం ఆటోలో త్రిపురారం వైపు తీసుకు వెళ్తుండగా అట్టి పిడిఎస్ బియ్యంను మరియు ఆటోను స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనదనీ తెలిపారు. ఎవరైనా అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తరలించినట్లయితే, పిడిఎస్ బియ్యాన్ని అమ్మిన, కొన్న వారిపై కూడా కేసు నమోదు చేస్తామని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యువత లక్ష్య సాధనకై కృషి చేయాలి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**వేదన్యూస్, నల్గొండ/ మిర్యాలగూడ ప్రతినిధి:**



యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్య సాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ యాంటి డ్రగ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదిత్యా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో కలసి జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం మాదకద్రవ్యాలు వినియోగ వలన కలిగే ఆరోగ్య ప్రభావాలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాల పై అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ... మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హానికర ప్రభావాలతో పాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తింపు గౌరవం ఉండదని తెలిపారు. ఈ డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే సమాచారం అందించాలని కోరారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా పోస్టర్ ఆవిష్కరించారు. డ్రగ్స్ నిర్మూలన సోల్జర్ గా నమోదు చేసుకోవడానికి లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివ రాం రెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహా లక్ష్మయ్య, ఆర్.ఐలు సంతోష్ హరిబాబు, యస్ఐలు సైదులు, సైదాబాబు, శంకర్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కౌశిక్.. నీ స్వగ్రామంలో చేసిన అభివృద్ధి ఏంటి?

- రూ. 1000 కోట్ల సంగతి ఏంటి?
- ఎమ్మెల్సీగా నువ్వు చేసిన అభివృద్ధి ఏది?
- కాంగ్రెస్ యువనేత ప్రశాంత్ పటేల్ ఫైర్

**వేద న్యూస్, వీణవంక:**



హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన స్వగ్రామమైన వీణవంక మండలంలో చేసిన అభివృద్ధి ఎక్కడ? అని కాంగ్రెస్ యువ నాయకుడు ప్రశాంత్ పటేల్ మద్దుల ప్రశ్నించారు. కనీసం గా సొంతూరుని కౌశిక్ అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా సుమారు రెండేళ్లు ఉన్న, ఎమ్మెల్యేగా ఏడాది దాటుతున్నా నియోజకవర్గ అభివృద్ధిపై కనీస పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్ ను విమర్శించడానికి బీఆర్ఎస్ నాయకులకు నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి రూ.1000 కోట్లు అని చెప్పి.. కనీసంగా నియోజకవర్గంలో పట్టించుకో కుండా.. విదేశీ పర్యటనలు చేస్తూ.. కాలాన్ని వెల్లదీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి వొడితల ప్రణవ్ ప్రజా నాయకుడని పేర్కొన్నా రు. బీఆర్ఎస్ నేతల విమర్శలకు మద్దుల ప్రశాంత్ సోమవారం కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన రిలీజ్ చేశారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండే జననేత ప్రణవ్ బాబు అని వెల్లడించారు. ఎమ్మెల్సీగా ఉంసర్ సైతం హుజురాబాద్ నియోజకవర్గానికి పైసా పనిచేయని నాయకుడు కౌశిక్ రెడ్డి అని విమర్శించారు. తన సొంత మండలం అయిన వీణవంకలో డబుల్" బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు అందించాలనే సోయి లేని నేత ఎమ్మెల్యే అని ప్రశాంత్ విమర్శించారు. "డబుల్" ఇండ్ల పరిసరాలు పడావు పడి, శిథిలావస్థకు చేరుకుంటున్న .. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కి కనీస పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్.. ప్రజా క్షేత్రంలో చేస్తున్న పనుల గురించి జనం అందరికీ తెలుసని వెల్లడించారు. ప్రణవ్ బాబు తాతల కాలం నుంచి ప్రజాక్షేత్రంలో నే ఉండి ప్రజా సేవ చేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రస్తుత హుజురాబాద్ ఎమ్మెల్యేకు రాజీనామా చేసి మరోసారి గెలిచే దమ్ముందా? అని సవాల్ విసిరారు. ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం చేసిన పనులు ఏమిటో కౌశిక్ రెడ్డి చెప్పాలని అడిగారు. స్థానిక ఎమ్మెల్యే పనితీరుపై ప్రజాక్షేత్రంలో చర్చకు కాంగ్రెస్ నాయకులు అయిన తాము సిద్ధమని స్పష్టం చేశారు. ప్రణవ్ కనీసం గా వార్డు మెంబర్ గా గెలవలేదని గులాబీ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారని, కానీ, ఆయన తాతల కాలం నుంచి రాజకీయం ఆ కుటుంబం నుంచి కొనసాగుతున్నదని పేర్కొ న్నారు. మరోసారి తమ జననేత ప్రణవ్ జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# మీరు చేయకపోతే.. మేము చేస్తాం..!

- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీపై సిపిఐ నాయకుల వ్యాఖ్యలు
- అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు పంపిణీ చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**వేద న్యూస్, కమలాపూర్ :**




ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎంత మంది పాలకులు మారినా పేదల గూడు మాత్రం మారదు. అవే పూరి గుడిసెలు, వర్షం పడితే గుడిసెలోంచి కారే వర్షపు నీటి చుక్కలు, ఆ నీటిని ఇంటి లోపటికి రాకుండా గుడిసెపై పరదా కప్పుకోవడం తాత్కాలికంగా ఉపశమనం పొందడం ఇది ఒక నిరుపేద గూడు పరిస్థితి. ఇంకా ఎన్నిరోజులు ఇలా? లక్షల కోట్ల బడ్జెట్లో నిరుపేద కుటుంబాలకు ఒక ఇల్లు ఇవ్వలేరా? మా పార్టీ అధికారంలోకి వస్తే యుద్ధ ప్రాతిపదికన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి ఇస్తాము. ఒకవేళ కట్టివ్వకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగము. మాట తప్పము మడమ తిప్పము అని హెూరెత్తే డైలాగులు చెప్పి అధికారంలోకి రావడం ఆ తర్వాత అధికారం కోల్పోవడం మరొక పార్టీ అధికారంలోకి రావడం మళ్లీ చెప్పిన డైలాగులే చెప్పడం, వాళ్లు కూడా పాలన సమయం ముగిసిన తర్వాత గద్దె దిగడం మరొకరు అధికారంలోకి రావడం ఇదే తంతు. ప్రభుత్వాలు మారుతయ్. పాలకులు మారుతరు. ఎన్నికల్లో ఇచ్చే హామీలు అధికారంలోకి రాగానే మాటలు మారు తాయి. కానీ మారనిది ఒకటే ఒకటి నిరుపేదల గుడిసెలు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తాము పంచుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అర్హులైన పేదలకు గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గాని, ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు గాని కేటాయించి పేదలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

## జర్నలిస్టు సమస్యలను పరిష్కరించాలి..!


**వేద న్యూస్, మరిపెడ :**

రాష్ట్రంలో దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని దళిత జర్నలిస్టుల ఐక్యవేదిక మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ కట్కూరి ప్రసాద్ అన్నారు. మరిపెడ మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో దళిత జర్నలిస్టులకు శిక్షణ శిబిరాలు పెట్టి సర్టిఫికెట్లు ఇచ్చి ఆర్థిక సహకారం అందించకుండా చేతుల్లో చేసిందని, దళిత బంధు విషయంలో దళిత జర్నలిస్టులను మభ్యపెట్టి మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలలో దళిత జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేగాక సోషల్ మీడియా అభివృద్ధి చెందిన తర్వాత విలేకరులపై దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని. తర్వాత కలిగిన వర్కింగ్ జర్నలిస్టు లందరికీ అక్రిడేషన్ కార్డులు అందించాలని కోరారు.

### దళిత జర్నలిస్టు ఐక్యవేదిక మరిపెడ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షులు
మెరుగు సంజీవ



ప్రధాన కార్యదర్శి
చింత వెంకన్న



కోశాధికారి
తప్పెట్ల సురేష్

అధ్యక్షులుగా మెరుగు సంజీవ, ప్రధాన కార్యదర్శిగా చింత వెంకన్న, కోశాధికారిగా తప్పెట్ల సురేష్ లను దళిత జర్నలిస్టుల ఐక్యవేదిక మరిపెడ మండల నూతన కమిటీ జిల్లా కన్వీనర్ కట్కూరి ప్రసాద్, కో కన్వీనర్ జిన్నా లచ్చయ్య, అంబాల కుమారుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వంకాయలపాటి తిరుమలరావు, నూతన అధ్యక్షులుగా మెరుగు సంజీవ, ప్రధాన కార్యదర్శిగా చింత వెంకన్న, కోశాధికారిగా తప్పెట్ల సురేష్, ఉపాధ్యక్షులుగా బి సోమన్న, సహాయ కార్యదర్శిగా గంగుల వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా పోస్ట్ వెంకన్న తదితరులు ఉన్నారు. దళిత జర్నలిస్టుల ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. త్వరలో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రసాద్ కోరారు.



## బోనాల పండుగకు కొండా మురళికి ఆహ్వానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

జులై 6న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీమాబాద్ లో కురుమ కులస్తులు నిర్వహించనున్న బోనాల జాతరకు రావాలని కోరుతూ సోమవారం కరీమాబాద్ శ్రీ బీరన్న స్వామి దేవస్థానం కమిటీ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండా మురళి బోనాల పండుగకు అన్ని రకాల ఏర్పాట్లకు సహకరిస్తానని చెప్పినట్లు కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు కోరే కృష్ణ, ఉపాధ్యక్షులు కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, కోశాధికారి నరిగ లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, మండల కొమురెల్లి కోర కుమారస్వామి, బండారి రాజేశ్వర్, ఆర్గనైజర్స్ నంద నవీన్ కొట్టే, సదానందం, గుట్ట మల్లేశం, కార్యవర్గ సభ్యులు కంచ తిరుపతి, వాసవి శ్రీనివాస్, ఎమ్మె వేణు, కోరే రమేష్, అన్న శ్రీనివాస్, మురికి చిన్న, రవి, కంచ మెట్టయ్య, కొమ్ము రాజు, కాటన్ సతీష్, బండారి మల్లేశం, కుల పెద్దలు మండల రాజు, దయ్యాల పురుషోత్తం, కురుమ కులస్తులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073